సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు పలికాయి. మార్కెట్‌కు 873 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



రూ.10 వేల కోసం ప్రాణం తీశాడు

పట్టుచీరకు సంబంధించిన రూ.10 వేలు అడిగినందుకు ఓ వ్యక్తి తన పెద్దమ్మ కుమారుడి ప్రాణం తీశాడు. ఈ ఘటన శుక్రవారం ధర్మవరంలో జరిగింది. 8లో



జిల్లావ్యాప్తంగా శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- విధుల్లో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు
- అధికారులతో సాధారణ ఎన్నికల పరిశీలకుడు అన్బుకుమార్



తహసీల్దార్ కార్యాలయం అధికారులతో మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్

హిందూపురం టౌన్: ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ప్రతి ఒక్కరూ విధుల్లో అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్య, ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కౌంటింగ్, భద్రత ఏర్పాట్ల చర్యలు, ఎంసీఎంసీ తదితర కమిటీల పర్యవేక్షణ, పనితీరు, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన శిక్షణ, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలలో చేపట్టిన పనులు వివరాలను హిందూపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జేసీ అభిషేక్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట హిందూపురం తహసీల్దార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ కార్యాలయ పరిశీలన

మడకశిర: ఎన్నికల సాధారణ పరిశీలకులు అన్బుకుమార్ శుక్రవారం మడకశిర ఆర్‌ఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌రావుతో పలు అంశాలపై సమీక్షించారు. అంతేకాకుండా ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు అందించారు.

నేడు 5వ తరగతి ప్రవేశ పరీక్ష

లేపాక్షి: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి (2024–25 విద్యాసంవత్సరం) ప్రవేశం కోసం శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా నుంచి 4,382 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, వారి కోసం 11 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. లేపాక్షిలో 809 మంది, టేకులోడు 682, నసనకోట 630, పేరూరు 471, గుండుమల 365, గుడిబండ 361, రేగాటిపల్లి 293, బుక్కపట్నం 284, రొద్దం–1లో 192, రొద్దం–2లో 145, ధర్మవరం కేంద్రంలో 150 మంది చొప్పున పరీక్ష రాయనున్నట్లు ఆయన వెల్లడించారు.

సరిహద్దుల్లో బందోబస్తు



కర్ణాటక సరిహద్దులోని ఓ మద్యం దుకాణాన్ని మూసివేసిన దృశ్యం

పుట్టపర్తి టౌన్: కర్ణాటకలో శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు సరిహద్దు కర్ణాటక రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు, స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు సరిహద్దులో ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు సాయంత్రం ఐదు గంటల వరకు బంద్ చేశారు. మద్యం, కల్లు దుకాణాలు, ఇతరత్ర ఎక్సైజ్ డిపార్టుమెంట్ నుంచి లైసెన్స్ పొందిన దుకాణాలన్నీ సాయంత్రం ఐదు తర్వాత తెరిచినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ తెలిపారు.

సవిత ఇంధన దాహం

సవిత..పెనుకొండ టీడీపీ అభ్యర్థి. కానీ టీడీపీ నేతలే ఆమెను తమ అభ్యర్థిగా ఒప్పుకోరు. వెంట తిరగడం కాదు కదా.. ఆమె రోడ్డుపై వస్తుంటూనే పక్కకు తప్పుకుంటారు. ఎవరైనా సవిత పేరు ప్రస్తావిస్తే విలువల్లేని మనిషంటూ దూషణలకు దిగుతున్నారు. ఆమె అవినీతి చరిత్ర అంతా పూసగుచ్చినట్లు చెబుతారు. కానీ చంద్రబాబు, లోకేష్ మాత్రం సవితకు టికెట్ ఇచ్చారు కదా అని ప్రశ్నిస్తే.. ఓడిపోయే కాలం.. అంటూ నిట్టూరుస్తున్నారు.

- కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోలు రవాణా
- తన పెట్రోలు బంకుల ద్వారా విక్రయాలు
- పెట్రోల్ బంకుల్లోనూ మోసాలతో అక్రమార్జన
- అధికారుల తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- భర్త వెంకటేశ్వరరావు ఇంట్లో సీబీఐ దాడులు
- రైల్వే కాంట్రాక్టుల్లో అక్రమాలు చేసినట్లు ఆరోపణలు
- సవిత క్వారీల్లో అవకతవకలు.. మూసి వేసిన అధికారులు



జాతీయ రహదారి పక్కన 'కియా' సమీపంలోని సవిత పెట్రోల్ బంక్



ఎర్రమంచి పంచాయతీ పరిధిలో హరిపురం వద్ద సవిత వేసిన వెంచర్ సమీపంలో ఉన్న పెద్ద వంక



వంకపై రోడ్డు వేసి ఆర్చ్ నిర్మించి వెంచర్‌లోకి వెళ్లేందుకు వేసిన దారి

పెనుకొండ మండలం ఎర్రమంచి పంచాయతీ సర్వే నంబర్లు 204, 203, 205, 213లలో 39 ఎకరాల్లో సవిత వెంచర్ వేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అయితే సమీపంలోనే పెద్దవంక ఉండగా దానిపై బ్రిడ్జి నిర్మించి హైవే నుంచి వెంచర్‌లోకి వెళ్లేందుకు అక్రమంగా దారి ఏర్పాటు చేశారు. ఇక సర్వే నంబర్ 213లోని 1.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఈ వెంచర్‌లోనే కలిసిపోయి ఉంది. అయినా అధికారులు కనీసం అటువైపు చూడలేదు.

సాక్షి, పుట్టపర్తి/పెనుకొండ: పెనుకొండ టీడీపీ అభ్యర్థి ఎస్.సవిత అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఆమెకు టీడీపీ టికెట్ ఖరారు చేసిన వెంటనే టీడీపీ నేతలే ఆమె అవినీతి చిట్టా అంతా అడిగిన వారికీ, అడగని వారికీ చెబుతున్నారు. ఆమె భర్త వెంకటేశ్వరరావు రైల్వే కాంట్రాక్టర్ కాగా, ఆయన కూడా పలు పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు చెబుతున్నారు. మొత్తంగా సవిత పేరు చెబితేనే విలువల్లేని మనిషని, అవినీతి అక్రమాలకు ప్రతీక అంటూ పెనుకొండ టీడీపీ నేతలే చెబుతున్నారు.

సవిత ఇంట్లో సీబీఐ సోదాలు..

మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి కుమార్తెగా సవిత ప్రజల్లోకి వచ్చారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వెంకటేశ్వరరావును పెళ్లి చేసుకున్నారు. ఆయనతో కలిసి ఆమె కూడా రైల్వే కాంట్రాక్టులు చేశారు. ఈ క్రమంలోనే అవినీతి ఆరోపణలు వెల్లువెత్తగా... 2022 నవంబర్ 4న బెంగళూరు నుంచి సీబీఐ అధికారులు పెనుకొండకు వచ్చారు. సవిత ఇంట్లో తనిఖీలు చేసేందుకు సిద్ధం కాగా, ఆమె అడ్డుకున్నారు. హడావుడి చేశారు. కానీ సీబీఐ అధికారులు కోర్టు ఇచ్చిన సెర్చ్ వారెంట్ చూపడంతో పాటు స్థానిక పోలీసుల సాయంతో సవిత ఇంట్లో సోదాలు చేపట్టారు. పలు రికార్డులను సీజ్ చేసి బెంగళూరుకు తీసుకెళ్లారు. భర్త చేసిన అక్రమ బాగోతంలో భార్య సవిత పాత్ర ఉందని స్థానిక నేతలు చెబుతున్నారు. ఇన్ని తెలిసినా.. చంద్రబాబు పెనుకొండ టికెట్ ఇవ్వడంపై జనం పెదవి విరుస్తున్నారు. ఇక పెనుకొండ టీడీపీ నేతలు బహిరంగంగానే దూషణలకు దిగుతున్నారు.

టీడీపీ హయాంలో బాగా పోగేసిన సవిత..

భర్త సాయంతో చంద్రబాబు, లోకేష్‌లతో పరిచయం పెంచుకున్న సవిత.. వారి అండతో బాగానే ఎదిగారు. పెనుకొండ పరిసర ప్రాంతాల్లో సొంతంగా క్వారీలు, పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే కురుబ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా కొనసాగారు. ఆ సమయంలోనే పెట్రోల్ బంకుల్లో భారీ దందాకు తెరలేపారు. పెనుకొండ, సోమందేపల్లి, కియా కార్ల కంపెనీ వద్ద ఉన్న తన పెట్రోలు బంకులకు కర్ణాటక నుంచి డీజిల్, పెట్రోల్ అక్రమంగా తీసుకువచ్చేవారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో 'కియా' కార్ల కంపెనీలోని కంటెయినర్లు, లారీలు, కార్లకు ఇంధనాన్ని విక్రయించి రూ.కోట్లను ఆర్జించారు. అయితే సవిత బంకుల్లో మోసాలు కూడా ఎక్కువ కావడంతో ప్రజలు ఫిర్యాదులు చేశారు. దీంతో అధికారులు పెట్రోల్ బంకుల్లో సోదాలు చేయగా.. కర్ణాటక నుంచి అక్రమంగా ఇంధనం తెప్పించిన సవిత తన పెట్రోల్ బంకుల ద్వారా విక్రయాలు చేసినట్లు తేలింది. ఇలా అక్రమ ఇంధన వ్యాపారంతో డబ్బు పోగేసిన సవిత కమ్మ సామాజిక వర్గానికి చెందిన తన భర్త వెంకటేశ్వరరావుతో లాబీయింగ్ చేయించి.. నారా లోకేశ్ అండదండలతో పెనుకొండ టికెట్ తెచ్చుకున్నారని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

అనధికార క్వారీలతో..

పెనుకొండ చుట్టుపక్కల అనధికారికంగా క్వారీలు నిర్వహించి అక్రమంగా రూ.కోట్లు సంపాదించారని ఎస్.సవితపై ఆరోపణలున్నాయి. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని అడ్డగోలుగా అక్రమార్జనే ధ్యేయంగా మైనింగ్ దందా చేశారు. అప్పట్లో మైనింగ్ అధికారులు పలుమార్లు దాడి చేసి క్వారీలను తనిఖీ చేశారు. ఆ సమయంలో గుట్టూరు సమీపంలోని క్వారీని మూసి వేయించారు. అంతేకాకుండా భారీ స్థాయిలో జరిమానా కూడా విధించారు. సవిత అవినీతిని సొంత పార్టీ నేతలే బహిర్గతం చేస్తుండటం విశేషం.

దూరంగా బీకే వర్గీయులు..

పెనుకొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి వర్గీయులు సవిత నాయకత్వాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెకు మద్దతు ఇచ్చేది లేదని బహిరంగంగా చెబుతున్నారు. సవితకు టికెట్ ఖరారు చేసినప్పటి నుంచి బీకే ఇంటి వద్ద రోజుల తరబడి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విలువల్లేని మహిళకు టికెట్ కేటాయించారని చంద్రబాబునాయుడు, లోకేష్‌లపై మండిపడ్డారు. దీంతో పెనుకొండలో గెలవడం కష్టమని భావించిన సవిత అధిష్టానానికి బీకే వర్గంపై ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఎవరికీ సర్దిచెప్పలేని పరిస్థితుల్లో చంద్రబాబు, చినబాబు బిజీబిజీగా ఉన్నట్లు డ్రామా ఆడుతున్నారని టీడీపీ కార్యకర్తలే పేర్కొంటున్నారు. అందువల్లే ఆమె వెంట నడవడం లేదని చెబుతున్నారు.



నారా లోకేష్‌కు నమస్కరిస్తున్న సవిత (ఫైల్)

సవితపై 17 కేసులు

సవిత ఇటీవల తన నామినేషన్ సందర్భంగా తనపై 17 కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పెనుకొండ, కదిరి, రామగిరి, లేపాక్షి, అనంతపురం, కియా పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదయ్యాయి. ఇందులో ముఖ్యంగా అక్రమ రవాణా, దౌర్జన్యం, బెదిరింపులు, గృహహింస, ఛీటింగ్, అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, ప్రజల భద్రతకు భంగం కలిగించడం తదితర కేసులున్నాయి. అలాగే ఏసీబీ కోర్టులోనూ ఆమెపై కేసు నడుస్తున్నట్లు సవిత స్వయంగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం 10 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

నాలుగు రోజులు జాగ్రత్త!

- ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఐదారు రోజులుగా సూరీడు మండిపోతుండటంతో జిల్లా అగ్నిగుండంలా ఉడికిపోతోంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న వడగాల్పులు జనానికి ముచ్చెటమలు పట్టిస్తున్నాయి. ఉదయం 9 గంటలకే సూర్యప్రతాపం మొదలవుతుండగా సాయంత్రం 6 గంటల వరకు తగ్గడం లేదు. సాయంత్రం 6 గంటల సమయంలోనూ ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు బయటకు రావాలంటే జంకుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రాగల నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే పరిస్థితి ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాగల నాలుగు రోజులు పగటి ఉష్ణోగ్రతలు 42.4 నుంచి 43.7 డిగ్రీల మధ్య నమోదు కావచ్చన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 26.5 నుంచి 27.8 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 46 నుంచి 52 మధ్య, మధ్యాహ్నం కనిష్టంగా 17 నుంచి 23 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. గంటకు 6 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా వడగాల్పులు వీస్తాయని చెబుతున్నారు.

కాలు బయటపెట్టొద్దు..

ఉష్ణోగ్రతల పెరుగుతున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులు, జీవాలకు పశుగ్రాసం, నీడ, నీళ్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులు తెలిపారు. వడదెబ్బ బారి నుంచి తప్పించుకోవాలంటే మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్, నిమ్మరసం, బియ్యం నీరు (తోరణి), కొబ్బరినీళ్లు, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.. వదులుగా ఉండే తెల్లటి కాటన్ దుస్తులు, టోపీ, గొడగు, శరీరానికి సూర్యరశ్మి తాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యసహాయం తీసుకోవాలని తెలిపారు.

నామినేషన్ల పరిశీలన ప్రశాంతం



అభ్యర్థుల సమక్షంలో పరిశీలన చేస్తున్న అధికారులు



నామినేషన్ల పరిశీలనకు కలెక్టరేట్‌కు వచ్చిన హిందూపురం ఎంపీ అభ్యర్థి జె.శాంత

- కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాలకు అభ్యర్థులు
- సాయంత్రం వరకూ కొనసాగిన నామినేషన్ల పరిశీలన

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల స్థానాల నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పత్రాల పరిశీలన ప్రక్రియ శుక్రవారం సజావుగా సాగింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకూ నామినేషన్ల పరిశీలన కొనసాగింది. అభ్యర్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు, అఫిడవిట్‌లో పొందు పరిచిన అంశాలను ఆర్‌ఓలు వివరించారు. అభ్యర్థుల అనుమతితో వారి సమక్షంలోనే పరిశీలన చేసి సక్రమంగా ఉన్న వాటిని ఆమోదించి, సరైన వివరాలు లేని వాటిని తిరస్కరించారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం స్థానానికి సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల పత్రాల పరిశీలన ప్రక్రియను కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అరుణ్‌కుమార్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గం స్థానాలకు సంబంధించి నామినేషన్ల పత్రాల పరిశీలన ప్రక్రియను ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు తమ కార్యాలయాల్లో నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ స్థానానికి 24 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా పరిశీలనలో 9 నామినేషన్లను తిరస్కరించారు. మిగతా 15 నామినేషన్లు ఆమోదించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జోలదరాశి శాంత, టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథితో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లు ఇలా

నియోజకవర్గం	దాఖలు	ఆమోదం	తిరస్కరణ
హిందూపురం	21	13	8
పుట్టపర్తి	27	16	11
పెనుకొండ	15	10	5
ధర్మవరం	22	15	7
మడకశిర	22	16	6
కదిరి	18	13	5
రాప్తాడు	26	15	11
మొత్తం	151	98	53

151 నామినేషన్లలో 98 ఆమోదం

జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తంగా 151 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన తర్వాత అధికారులు 98 నామినేషన్లకు ఆమోదం తెలిపారు. మరో 53 నామినేషన్లను తిరస్కరించారు. ప్రస్తుతానికి హిందూపురం నియోజకవర్గం నుంచి 13 మంది, పుట్టపర్తి నుంచి 16 మంది, పెనకొండ నుంచి 10 మంది, ధర్మవరం నుంచి 15, మడకశిర నుంచి 16 మంది, కదిరి నుంచి 13 మంది, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 మంది బరిలో నిలిచారు.

ఉపసంహరణకు 29వ తేదీ ఆఖరు..

ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29వ తేదీ వరకు గడువు ఉంది. ఉపసంహరణ గడువు అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తుది జాబితాను రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు.

పాపం.. పచ్చ నేతలు

- ప్రచారంలో వెంటరాని 'తమ్ముళ్లు'
- నామినేషన్ల ఘట్టానికీ దూరం
- జనసమీకరణకు అవస్థలు
- పోలింగ్ ముందే చేతులెత్తేసిన వైనం

సాక్షి, పుట్టపర్తి: అభ్యర్థుల మార్పులు... బీజేపీ, జనసేనతో పొత్తులతో తమ్ముళ్లు సైలెంట్ అయ్యారు. పోలింగ్ ముందే కాడి కింద పడేశారు. ప్రచార పర్వం నుంచే పూర్తిగా పక్కకు తప్పుకుంటున్నారు. చంద్రబాబు తీరు బాలేదని.. నారా లోకేశ్ గుర్తించడం లేదని.. అభ్యర్థుల ఎంపికలో సంప్రదించలేదని.. అసమ్మతిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే నామినేషన్ల దాఖలు సమయంలోనూ టీడీపీ కార్యకర్తల సందడి కనిపించలేదు. హిందూపురం పార్లమెంటు పరిధిలో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల నామినేషన్ రోజున ఐదు వేల మంది కూడా వెంట రాకపోవడం గమనార్హం.

సాదాసీదాగా నామినేషన్..


పుట్టపర్తి, మడకశిర, కదిరి నియోజకవర్గాల్లో తమ్ముళ్లు డీలా పడ్డారు. మరోవైపు బీజేపీ బరిలో ఉన్న ధర్మవరంలోనూ ఢిల్లీ పెద్దలు వచ్చినా.. స్థానిక కార్యకర్తల హడావుడి కనిపించలేదు. హిందూపురం పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తోన్న బీకే పార్థసారథి నామినేషన్ సందర్భంగా కలెక్టరేట్ వద్ద హంగామా చేయాలని భావించినా.. జనాలు లేకపోవడంతో సాదాసీదాగా వచ్చి నామినేషన్ దాఖలు చేసి వెళ్లిపోయారు.

పుట్టపర్తిలో దుకాణం బంద్..

టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి కొత్తముఖం కావడంతో ఆమె నాయకత్వాన్ని బలపరిచేందుకు పుట్టపర్తిలో సీనియర్లు వెనుకడుగు వేస్తున్నారు. మరోవైపు ఓటమి భయంతో వాస్తుదోషం పరిశీలనలో పడి.. టీడీపీ కార్యాలయం కూడా మూసి వేశారు. కొత్తగా పట్టణ శివారులోని ఓ అద్దె భవనంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మకాం పెట్టారు. ప్రచారంలో కూడా జనాలు లేక 'పల్లె' దిక్కులు చూస్తున్నారు. ఓటమి ముందే చూసినట్లు ఉందని.. చాలామంది 'తమ్ముళ్లు' సహకరించడం లేదు. దీనికి తోడు టీడీపీ అసమ్మతి నేతలు ఎవరికి వారుగా ఉన్నారు. టీడీపీలోని వడ్డెర్లంతా పార్టీకి రాజీనామా చేశారు. అందులో ఒకరు టీడీపీ రెబల్‌గా నామినేషన్ పత్రాలు కూడా సమర్పించారు.

మడకశిరలో మడతపెట్టేసినట్లే!

మడకశిరలో టీడీపీని తమ్ముళ్లే మడతపెట్టేశారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చక్రం తిప్పి.. ఎంఎస్ రాజుకు టీడీపీ బీఫాం ఇప్పించడంతో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఆయన తనయుడు సునీల్‌కుమార్ అడ్డం తిరిగారు. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన మడకశిరలో బీసీ నేత గుండుమల తిప్పేస్వామి హడావుడి చేస్తుండగా.. దళితుల నుంచి విమర్శలు వస్తున్నాయి.



కదిరిలో కనికరం లేకపాయె..

తొలి జాబితాలో కందికుంట యశోదమ్మ పేరు ప్రకటించారు. మలిజాబితాలో కందికుంట వెంకట ప్రసాద్ పేరు ఖరారు చేశారు. ఆ వారం రోజుల వ్యవధిలో కందికుంట ప్రసాద్‌పై కేసు కూడా కొట్టివేశారు. అయితే చంద్రబాబు కనికరం చూపినా.. స్థానిక టీడీపీ నేతలు కందికుంట నాయకత్వాన్ని బలపర్చడం లేదు. ముస్లిం ఓట్లు అధికంగా ఉండే కదిరిలో బీజేపీతో చేతులు కలిపిన టీడీపీ వెంట తిరిగేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే చాలామంది ముస్లిం నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో ప్రచారంలో కందికుంట వెంకట ప్రసాద్ వెంట నడిచే వారు కరువయ్యారు. చివరకు నామినేషన్‌కు కూడా జనసమీకరణ చేతగాక కందికుంట ఐదుగురితో వెళ్లి నామినేషన్ వేశారు.

వెంటాడుతున్న అసమ్మతి..

హిందూపురం పార్లమెంటు వ్యాప్తంగా టీడీపీ అభ్యర్థులను అసమ్మతి వెంటాడుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ రెబల్స్ బెడద ఉంది. కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలువగా.. మరికొందరు మద్దతు ఇవ్వకుండా.. దూరంగా ఉంటున్నారు. దీంతో ప్రచారం చేయడంలో టీడీపీ అభ్యర్థులు వెనుకబడ్డారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ జనసందోహం మధ్య నామినేషన్లు వేయడంతో పాటు ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

చంద్రప్రభపై చౌడేశ్వరి

- అమ్మవారికి జ్యోతులు సమర్పించిన భక్తులు

అమడగూరు: ఉత్సవాల్లో భాగంగా చౌడేశ్వరీదేవి నాల్గోరోజు శుక్రవారం చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమడగూరుకు చెందిన బ్రాహ్మణ, శెట్టి బలిజ సంఘం వారు అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చంద్రప్రభ ఉత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చంద్రప్రభపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి ఎదుట కొలువుదీర్చారు. మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించి భజనలు చేశారు. భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. అమ్మవారి ఎదుట డప్పు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో యువకులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు..

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో అమ్మవారికి బోనాలను సమర్పించారు. చీకిరేవులపల్లి, గంగిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి, బలకవారిపల్లి, అమడగూరు గ్రామాల్లో మహిళలు బోనాలను తీసుకెళ్లి చౌడేశ్వరీదేవిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో అమ్మవారికి పెద్దత్తున జంతు బలులను అర్పించారు. బంధుమిత్రులతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

నేడు జ్యోతి ఉత్సవం..

ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీజ్యోతి మహోత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు తరలిరానున్నారు. అమ్మవారి విగ్రహం ఎదుట వెలిగే జ్యోతిని చూడటం వల్ల మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం, అందువల్ల జ్యోతి ఉత్సవానికి పలుప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.



చంద్రప్రభ వాహనంపై చౌడేశ్వరీదేవి

క్లుప్తంగా

రూ.లక్ష నగదు స్వాధీనం



నగదును చూపుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట వై జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన నల్లపరెడ్డి వద్ద ఎలాంటి ఆధారాలు, బిల్లులు లేకుండా రూ.లక్ష నగదు లభించింది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50 వేలకు పైగా డబ్బులుంటే స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టణంలో ఎవరైనా ఓటర్లకు డబ్బులు, మద్యం, వస్తువులు పంపిణీ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే 94407 96831 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. తనిఖీల్లో ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ ఓబుల నరసింహులు, కానిస్టేబుల్ కాటమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.70 వేల నగదు సీజ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంట వై జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం వాహనాల తనిఖీ చేపట్టారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం కలువట్ల గ్రామానికి చెందిన గడ్డన్నగారి బాలకంబన్న వద్ద రూ.70వేలు లభించింది. బిల్లులు కానీ, ఎటువంటి ఆధారాలు కానీ లేకపోవడంతో ఆ నగదును సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ బాషా, కానిస్టేబుల్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య




గోపాలనాయక్ (ఫైల్)

పావగడ: భూపూరు తండాలో గోపాల నాయక్ (30) దారుణ హత్యకు గురయ్యాడు. తిరుమణి పోలీసులు తెలిపిన మేరకు... భూపూరుతండాకు చెందిన నాగరాజనాయక్ గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వెళుతూ గోపాల్‌నాయక్‌ను కావాలనే ఢీకొట్టాడు. దీంతో గోపాలనాయక్ కోపోద్రిక్తుడై నాగరాజనాయక్‌పై చేయి చేసుకున్నాడు. ఘర్షణ పెద్దదవుతుండటంతో గ్రామపెద్దలు శాంతింపజేసి వారిని అక్కడి నుంచి పంపించారు. ఇంటికి వచ్చిన గోపాలనాయక్‌తో నాగరాజనాయక్ మరోమారు గొడవపడ్డాడు. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న కత్తితో గోపాలనాయక్ ఛాతీలోకి రెండుసార్లు పొడిచాడు. కత్తి నేరుగా గుండెను తాకడంతో గోపాలనాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. గోపాలనాయక్ కు భార్య తులసీబాయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, నిందితుడు నాగరాజనాయక్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ గిరీశ్ తెలిపారు.

అవమానాలు.. అణచివేతలు!

అన్నదాతలను ముప్పతిప్పలు పెట్టిన చంద్రబాబు

సొంత మామకు వెన్నుపోటు పొడిచి 1995లో అడ్డదారిలో అధికారం చేజిక్కించుకుని 2003 వరకు తొమ్మిదేళ్లు పాలించిన నారా చంద్రబాబునాయుడు తన జమానాలో రైతులను రాచి రంపాన పెట్టారు. అప్పట్లో వర్షాలు లేక పంటలు పండక పెట్టుబడులు కూడా దక్కకుండా పోయాయి. కరువు పరిస్థితుల నడుమ పొట్ట నింపుకోవడం కష్టమైంది. రైతులు, కూలీలు, పేద వర్గాలు వలసలతో దుర్భర జీవితం గడుపుతున్న సందర్భం అది. అలాంటి సమయంలో ప్రభుత్వం తరపున భరోసా కల్పించాల్సిన చంద్రబాబు మరింత నరకయాతనకు గురి చేశారు. కరెంటు బిల్లులు కట్టలేదంటూ ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించిన వాస్తవాలను రైతులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.



- ఉచిత విద్యుత్‌ను కోరిన రైతులను అవహేళన
- కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలంటూ అపహాస్యం
- కరెంటు బిల్లులు కట్టలేదని అన్నదాతలకు వేధింపులు
- బలవంతంగా మోటార్లు, స్టార్టర్లు లాక్కెళ్లి 14,156 మందిపై కేసులు
- అవమానం భరించలేక బలవన్మరణానికి పాల్పడిన 26 మంది రైతులు
- ఆ పీడకలలను మర్చిపోలేకపోతున్న జిల్లా రైతాంగం

అనంతపురం అగ్రికల్చర్: దేశానికి వెన్నెముకలా పట్టెడన్నం పెట్టే రైతన్న సంక్షేమాన్ని గాలికొదిలేసిన అప్పటి చంద్రబాబు సర్కారు పూర్తిగా అణచివేత ధోరణి అవలంబించింది. రైతులు, వ్యవసాయాన్ని చులకనగా చూసిన చంద్రబాబు ప్రభుత్వంలో రాయితీలు, ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతుల స్థితిగతులు ఘోరంగా తయారయ్యాయి. అన్నదాతల ఇంట అప్పులు, ఆక్రందనలు మిన్నంటాయి. పీకల్లోతు కష్టాల్లో మునిగిన సమయంలో కరెంటు చార్జీలను ఇష్టారాజ్యంగా పెంచేసి రైతును చావుకు దగ్గరగా తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. విద్యుత్ చార్జీలపై 2000 ఆగస్టు 28న ఛలో అసెంబ్లీ నిరసన కార్యక్రమానికి వెళ్లిన రైతులను గుర్రాలతో తొక్కించి కాల్పులు జరిపించి చరిత్ర హీనుడైన చంద్రబాబు జిల్లాలో కూడా కరెంటు బిల్లులు నెలనెలా కట్టాల్సిందేనని ఉక్కుపాదం మోపారు. బిల్లులు కట్టని రైతులపై పోలీసులను ఉసిగొల్పారు. అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా పోలీసులు, అధికారులను బోరుబావుల దగ్గరకు పంపి మోటార్లు బలవంతంగా తీసుకెళ్లేలా కఠిన చర్యలకు దిగారు. వరుస కరువులతో చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో బిల్లులు కట్టాలని నియంతృత్వ చర్యలకు పాల్పడ్డారు. కరెంటు తీగలను తెంపడం, స్టార్టరు పెట్టెలు ఎత్తుకెళ్లి కరెంటు ఆఫీసులు, పోలీసు స్టేషన్లలో పెట్టుకున్నారు. ఏమిటీ దురాగతం అని ప్రతిఘటించిన రైతులపై దాడి చేయడమే కాకుండా జైల్లో పెట్టించిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కుతుంది.

కరెంటు బిల్లులు కట్టని 14,156 మంది రైతులపై కేసులు నమోదు చేసిన చరిత్ర చంద్రబాబుదే అనేది జగమెరిగిన సత్యం. 'కరెంటు' అవమానం భరించలేక అప్పట్లో 26 మంది రైతన్నలు అర్ధంతరంగా తనవులు చాలించారు. మరోపక్క వర్షాలు లేక అప్పట్లో ఉన్న 1.35 లక్షల బోరుబావుల్లో నీళ్లు రాక 50 వేల దాకా బోర్లు నిలువునా ఎండిపోయాయి. అయినా బిల్లులు కట్టాలని రైతులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. బోరులేదు, మోటారు లేదు.. కేవలం కరెంటు సర్వీసు ఉన్న పాపానికి బిల్లులు చెల్లించాల్సిందేనని రాత్రింబవళ్లు ఒత్తిడి చేయడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

నేనున్నా అంటూ వైఎస్సార్ భరోసా..

అలాంటి కష్టకాలంలో ఉన్న రైతులకు దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశాకిరణమయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన పాపాలకు ప్రజలు, రైతులు సరైన గుణపాఠం చెప్పి వైఎస్ రాజశేఖర రెడ్డికి పట్టం కట్టారు. తొమ్మిదేళ్లు భరించలేని కష్టాలు అనుభవించిన రైతులు 2004లో ఊపిరిపీల్చుకున్నారు. రైతు పక్షపాతిగా అధికారం చేపట్టిన మొదటి రోజే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రూ.1,295 కోట్ల కరెంటు బిల్లులన్నీ మాఫీ చేస్తూ తొలిఫైలుపై సంతకం చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నేనున్నా... అంటూ రైతుల్లో భరోసా నింపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి రైతులకు చెందిన విద్యుత్ బిల్లులు రూ.70.65 కోట్లు మాఫీ అయ్యాయి. అలాగే ఉచిత విద్యుత్ అందించి రైతుల్లో సంతోషం నింపారు. అంతటితో ఆగకుండా రాయితీలు,ప్రోత్సాహకాలు కల్పించి వ్యవసాయ రంగాన్ని, రైతులను అన్ని విధాలుగా గట్టెక్కించారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అంటూ ఆచరణాత్మకంగా రుజువు చేసిన ఘనత వైఎస్‌కే దక్కుతుంది. ఉచిత విద్యుత్ అంటే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలి అంటూ హేళన చేసిన చంద్రబాబుకు కనువిప్పు కలిగించారు. ఆ తర్వాత 2014–19 మధ్య మరో ఐదేళ్లు చంద్రబాబు రాష్ట్రాన్ని పాలించిన సమయంలో కూడా ప్రకృతి కరుణ, పాలకుల తోడు లేక వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తండ్రి చూపిన బాటలో నడుస్తూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రోత్సహిస్తుండటంతో వ్యవసాయం పండుగలా మారింది.

పెద్దకోట్లలో చోరీ



చోరీ జరిగిన ఇంటిలో విచారణ చేస్తున్న ఎస్‌ఐ

తాడిమర్రి: పెద్దకోట్ల గ్రామంలోని ఓ ఇంటిలో శుక్రవారం ఉదయం చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన గోగుల రాముడు, గోగుల సావిత్రి దంపతులు శుక్రవారం ఉదయం నార్పింపల్లిలో వివాహానికి వెళ్లి వచ్చారు. అనంతరం సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనికి వెళ్లారు. ఇంటివద్ద ఉన్న కుమారుడు ఇంటికి తలుపులు వేసి తాళం వేయకుండా టిఫిన్‌కు వెళ్లాడు. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉండటం కనిపించింది. బీరువాలోని రూ.50 వేల నగదు, అర తులం బంగారు (జత కమ్మలు) చోరీ అయినట్లు గుర్తించారు. గోగుల రాముడు దంపతులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగస్వామి జాగిలాలను రప్పించి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డాగ్‌స్క్వాడ్ ఎస్‌ఐ అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ శంకర్, హెచ్‌సీలు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీరాయుళ్లకు పుట్టగతులుండవు

- పక్కా ప్లాన్ ప్రకారమే కేతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు
- ధర్మవరం అభివృద్ధి, చేనేత సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- చేనేత వ్యాపారులు, ప్రముఖుల సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న చేనేత వ్యాపారులు, ప్రముఖులు

ధర్మవరం: ప్యాకేజీ కోసం వైఎస్సార్‌సీపీని వీడి మరొక పార్టీలోకి మారిన వారికి భవిష్యత్తులో పుట్టగతులుండవని ధర్మవరం చేనేత ప్రముఖులు, వ్యాపారులు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు చేనేతల సంక్షేమం కోసం జోలెపట్టి.. ప్రస్తుతం నేతన్న నేస్తం పథకం ద్వారా కార్మికులకు దన్నుగా నిలిచి.. ధర్మవరం పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రపథంలో నిలిపిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికే చేనేతల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఇకపై నిరాధారంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేనేత వ్యాపారులు, ప్రముఖులు ఉడుముల రాము, నీలూరి ప్రకాష్, గడ్డం శ్రీనివాసులు, బండారు ఆదినారాయణ, దాసరి లక్ష్మీనారాయణ, (డీఎల్), శంకర యుగంధర్, కాచర్ల అంజి మాట్లాడుతూ పలువురు నాయకులు స్వలాభం కోసం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ వెంట వెళ్లారన్నారు. అలా బీజేపీలో చేరిన వారు స్వామిభక్తిని చాటుకునేందుకు పక్కా ప్లాన్ ప్రకారం కేతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. పార్టీ మారిన గిర్రాజు నగేష్ గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. తిరుమలలో దర్శనం టిక్కెట్లు అమ్ముకునే నీవు కేతిరెడ్డిని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. మరో నాయకుడు సందా రాఘవ అట్టలు కొట్టుకుని బతికే స్థాయి నుంచి డబ్బు సంపాదించి ఆత్మీయ సమావేశాల పేరుతో మందు, మటన్‌లు సప్లై చేస్తూ కారు కూతలు కూస్తావా అంటూ మండిపడ్డారు. నేతన్న నేస్తం పథకంలో అవినీతి జరిగిందని మొరిగే మీరు అసలు ఆ పథకం డబ్బు నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయనే విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు. గతంలో కేతిరెడ్డి ద్వారా లబ్ధి పొంది ఇప్పుడు.. ప్లేటు ఫిరాయించిన వారికి భవిష్యత్‌లో తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు.

డబ్బులున్న వారికే మద్దతు ఇస్తారా?

ధర్మవరంలో చేనేత ప్రముఖులు కొంతమంది రౌండ్ టేబుల్ సమావేశం పెట్టి చేనేత సామాజికవర్గానికి చెందిన వారు ఎవరు పోటీ చేసినా మద్దతు ఇవ్వాలని తీర్మానం చేసి.. ఇప్పుడు ధనికుడైన సత్యకుమార్ గూటికి ఎందుకు చేరారని ప్రశ్నించారు. చేనేత రంగంపై జీఎస్టీ వేసి నడ్డి విరిచిన బీజేపీకి ఏ ముఖం పెట్టుకుని మద్దతు తెలుపుతున్నారన్నారు. బీసీ కాని బీసీ అయిన సత్యకుమార్‌కు ఢిల్లీలో పెద్ద పలుకుబడి ఉందని చెబుతున్నారని, అంత సత్తా ఉంటే చేనేతపై జీఎస్టీని రద్దు చేయిస్తామని ప్రధాని మోదీతో చెప్పించే దమ్ముందా అని ప్రశ్నించారు. నెల రోజులుగా ధర్మవరంలో ఇతర రాష్ట్రాల వారిని పెట్టి పట్టు వ్యాపారులను బెదిరిస్తూ, ప్రలోభాలకు గురి చేస్తూ బీజేపీ అభ్యర్థి చేస్తున్న వ్యవహారం చేనేతలంతా గమనిస్తున్నారన్నారు.

సాయమందించిన కేతిరెడ్డిని మరిచారా?

ప్రతిపక్షంలో ఉన్నపుడు ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదుకోకపోతే కేతిరెడ్డి పట్టణంలో జోలెపట్టి యాచించి 37 కుటుంబాలకు రూ.65 వేలు చొప్పున రూ.24.5 లక్షలు సాయం అందించిన విషయం మరిచిపోయారా అని చేనేత వ్యాపారులు, ప్రముఖులు ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున సాయం అందించిన ఘనత కేతిరెడ్డి కాదా అని అన్నారు. నేతన్ననేస్తం పథకంతో యేడాదికి మగ్గం ఉన్న చేనేత కుటుంబానికి రూ.24వేలు చొప్పున 5ఏళ్ల పాటు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పట్టణ అభివృద్ధి, చేనేతల సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్యాకేజీ రాయుళ్లకు సవాల్ చేశారు. కార్యక్రమంలో చేనేతలు సిద్దిరాజేష్, ఉక్కీశిల గోవిందు, కుండా మీనాక్షయ్య, దాసరి రంగయ్య, దాసరి రాజ్‌కుమార్, గుద్దిటి ఈశ్వర్, బాలం గోపాల్, కాళంగి శ్రీన, శంకర తేజ, గుర్రం రాజ, చింతా క్రిష్ణయ్య, కుమారస్వామి, చింతా మారుతి, చింతా యల్లయ్య, కడప రంగస్వామి, బ్రహ్మ, కత్తె పెద్దన్న, గజ్జల శివ, మేడాపురం వెంకటేష్, తోపుదుర్తి వెంకటరాముడు, గుద్దిటి ఈశ్వరయ్య, శాగా మురళి తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేల కోసం ప్రాణం తీశాడు

- అడ్డుకోబోయిన పెద్దమ్మ, మరో సోదరుడికి గాయాలు



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సుధారాణి

ధర్మవరం అర్బన్: పట్టుచీర డబ్బు రూ.10 వేలు అడిగినందుకు కోపోద్రిక్తుడైన యువకుడు పెద్దమ్మ కుమారుడిని కత్తితో నరికి చంపేశాడు. అడ్డుకోబోయిన పెద్దమ్మ, మరో సోదరుడిపైనా దాడిచేసి గాయపరిచాడు. శుక్రవారం రాత్రి ధర్మవరంలో ఈ సంఘటన జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని గీతానగర్‌లో నివసిస్తున్న సావిత్రి మగ్గం నేసుకుంటూ పట్టుచీరలు అమ్ముతుండేది. ఈమెకు ఇద్దరు కుమారులు పెద్ద మణికంఠ, చిన్న మణికంఠ(23). సావిత్రి నేసిన పట్టుచీరను తన చెల్లెలు నారాయణమ్మ కుమారుడు రమేష్‌కు రూ.10వేలకు అమ్మింది. పట్టుచీర తీసుకుపోయి చాలా రోజులైంది అయినా డబ్బు ఇవ్వలేదని శుక్రవారం రాత్రి సావిత్రి తన ఇద్దరు కుమారులతో కలిసి ఎదురింట్లో ఉన్న రమేష్‌ను అడిగారు. డబ్బులు ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య మాటామాట పెరిగి చివరికి రమేష్ ఇంట్లోంచి కత్తి తీసుకొచ్చి చిన్న మణికంఠను విచక్షణారహితంగా కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన పెద్దమ్మ సావిత్రిని కత్తితో గాయపరిచాడు. సోదరుడు పెద్ద మణికంఠ వీపుపై కూడా కత్తితో పొడిచి పారిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే పారిపోతున్న రమేష్‌ను పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. స్థానికులు తీవ్రంగా గాయపడ్డ చిన్న మణికంఠను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగానే చిన్న మణికంఠ మృతి చెందాడు. సావిత్రి, పెద్ద మణికంఠ ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. చిన్న మణికంఠ ఆరునెలల క్రితం సుధారాణి అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం సుధారాణి గర్భవతి. తన భర్త మృతి చెందాడని తెలిసి సుధారాణి ఆస్పత్రిలో బోరున విలపిస్తోంది. సావిత్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొల్హాపురి మహాలక్ష్మీ నమోస్తుతే!



కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అప్పేపల్లి, కాకి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు నియమనిష్టలతో ఇళ్లను శుభ్రం చేసి బియ్యం పిండితో చేసిన జ్యోతులను మహిళలు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఇంటి ఇలవేల్పుగా కొలిచే చుట్టుపక్కల గ్రామాలు, ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా వందల సంఖ్యలో భక్తులు ఉత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో పోతులరాజు చేపట్టిన నృత్యం చూపర్లను ఆకట్టుకుంది.

పాలబావిలో గంగపూజ...

రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజ రోజు కావడంతో పలువురు మహిళలు ఆలయ సమీపంలో ఉన్న పాల బావి వద్ద గంగ పూజ చేశారు.

అనుమానంతో అంతమొందించాడు

- భర్త చేతిలో భార్య హతం
- పోలీసుల అదుపులో నిందితుడు



రక్తపు మడుగులో పడి ఉన్న త్రివేణి మృత దేహం

పుట్టపర్తి అర్బన్: అనుమానంతో భార్యను భర్త కడతేర్చిన ఉదంతం వెంగళమ్మచెరువులో శుక్రవారం రాత్రి వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలను పుట్టపర్తి రూరల్ మండలం ఎస్‌ఐ కృష్ణమూర్తి మీడియాకు వెల్లడించారు. మండల పరిధిలోని బత్తలపల్లికి చెందిన త్రివేణి (25)కి వెంగళమ్మచెరువుకు చెందిన సుదర్శన్, అరుణమ్మ దంపతుల మూడో కుమారుడు పవన్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. సాఫీగా సాగిపోతున్న వీరి సంసారంలో ఇటీవల గొడవలు ప్రారంభమయ్యాయి. త్రివేణి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడినా, ఇతరులతో మాట్లాడినా పవన్ అనుమానపడేవాడు. రోజురోజుకూ అనుమానం పెనుభూతంగా మారింది. దీనికితోడు పవన్ తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మత్తులో తరచూ భార్యతో గొడవ పెట్టుకునేవాడు. శాడిస్టుగా ప్రవర్తిస్తుండేవాడు. పెద్దలు మందలించినా అతనిలో మార్పురాలేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో త్రివేణి పిల్లలను నిద్రపుచ్చి ఇంట్లో టీవీ చూస్తోంది. ఆ సమయంలో పవన్ పూటుగా తాగి ఇంటికి చేరుకున్నాడు. మాంసం కోసే కత్తి తీసుకుని భార్య మెడ, తల భాగాల్లో విచక్షణారహితంగా నరికాడు. దీంతో త్రివేణి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఇదే కాంపౌండ్‌లో ఉంటున్న పవన్ తల్లిదండ్రులు, అన్నలు, ఇరుగుపొరుగువారు పరుగున రాగా.. అప్పటికే త్రివేణి రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. భార్యను చంపిన తర్వాత పవన్ అక్కడే చూస్తూ నిల్చుండిపోవడం చూసి అందరూ నిశ్చేష్టులయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి





మృతులు కామాక్షమ్మ నాగరాజు

ధర్మవరం అర్బన్/ ఎన్‌పీకుంట: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతుల్లో ఒక మహిళ, పురుషుడుతో పాటు కర్ణాటకకు చెందిన ఓ యువకుడు ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి. ధర్మవరంలోని సిద్దయ్యగుట్టకు చెందిన చంద్రశేఖర్, అతని భార్య కామాక్షమ్మ (45) శుక్రవారం ద్విచక్రవాహనంపై దాదులూరుకు బయల్దేరారు. రేగాటిపల్లి రోడ్డు భైరవస్వామి గుడి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో కామాక్షమ్మ మృతి చెందింది. భర్త చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌లు ఢీకొని మరొకరు..

ఎన్‌పీకుంట మండలం గోపాలపురం సమీపంలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గోపాలపురానికి చెందిన నాగరాజు (48) తన ద్విచక్ర వాహనంపై రెక్కమాను వైపు వెళ్తున్నాడు. ఒడ్డిపల్లి కి చెందిన జయకుమార్, తులసీనారాయణలు రెక్కమాను నుంచి ఒడ్డిపల్లికి బైక్‌పై వస్తున్నారు. గోపాలపురం సమీపంలోకి రాగానే రెండు ద్విచక్రవాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా కదిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళుతుండగా నాగరాజు మార్గం మధ్యలో మృతి చెందాడు. జయకుమార్, తులసీనారాయణలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.

కర్ణాటక యువకుడు దుర్మరణం



మృతుడు దర్శన్

మడకశిర రూరల్: రోడ్డు ప్రమాదంలో కర్ణాటక యువకుడు దుర్మరణం చెందాడు. మధుగిరి తాలుకాలోని బీరనహళ్లికి చెందిన దర్శన్ (19) పావగడ తాలుకాలోని కురబలహళ్ళిలో బంధువుల ఇంటిలో జరిగే శుభ కార్యానికి శుక్రవారం ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. మడకశిర మండలం గొల్లపల్లి క్రాస్ సమీపంలో బైక్ అదుపు తప్పి బండరాయిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దర్శన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి



బాధితుడు రంగప్ప

సోమందేపల్లి: ఓబుళదేవరపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగప్పపై టీడీపీ నాయకుడు నారాయణప్ప తన అనుచరులతో కలిసి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు తెలిపిన మేరకు... గురువారం పెనుకొండలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్‌కు రంగప్ప కార్యకర్తలతో తరలివెళ్లాడు. నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావడాన్ని టీడీపీ నాయకుడు నారాయణప్ప జీర్ణించుకోలేకపోయాడు. శుక్రవారం రాత్రి రచ్చకట్టపై కూర్చుని చంద్రబాబు సీఎం అవగానే 'వాళ్లందరికీ పెన్షన్లు పీకేస్తాం' అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలనుద్దేశించి దూషిస్తూ మాట్లాడారు. ఎందుకు మా వాళ్లను తిడుతున్నారంటూ రంగప్ప నిలదీశాడు. కోపోద్రిక్తుడైన నారాయణప్ప తన అనుచరులతో కలిసి ఇటుకపెల్లతో రంగప్పపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు వెంటనే రంగప్పను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

సంక్షేమం ఇంటికి చేరాలంటే ఫ్యాన్‌కు ఓటేయండి



నవాబుకోటలో ప్రచారం చేస్తున్న కిషన్ రెడ్డి

ఓడీచెరువు: జగనన్న ఇస్తున్న సంక్షేమ ఫలాలు మీ ఇంటికే చేరాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి కోరారు. కొండకమర్ల పంచాయతీ నవాబుకోట, కొండతిమ్మయ్యగారిపల్లి, చెరువు మునెప్పపల్లి, నాయనాకోట తాండా, వీరప్పగారిపల్లి, ఎద్దులవాండ్లపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాను గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజు నాయుడు, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి , జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, కొండకమర్ల సర్పంచు తండ్రి రమణ, చింతమానిపల్లి సర్పంచు జగన్‌మోహన్‌చౌదరి, సీనియర్ నాయకులు నాగప్ప, శరత్, వెంకటనారాయణ, మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నిస్సార్, శింగనమల బాబు, సతీష్ రెడ్డి, సురేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డిని గెలిపించండి



మసకవంకపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ఓటర్లను కోరారు. మసకవంకపల్లి పంచాయతీలోని మసకవంకపల్లి, మూలప్పగారిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి అపర్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియపర్చారు. జగనన్న సీఎం అయితే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో అపర్ణారెడ్డికి ఘన స్వాగతం లభించింది. నాయకులు, కార్యకర్తలు క్రేన్ సాయంతో గజమాలతో అపర్ణారెడ్డికి స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. సర్పంచ్ అరుణమ్మ, మాజీ రెస్కో చైర్మన్ గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్.రాంమోహన్‌రెడ్డి, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి విశ్వనాథరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేశాయి భారతీరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జరిపిటి రవీంద్ర, మాజీ డీలర్ సూరి, రామలింగం , నారాయణస్వామి, లోకు, కళావతి, సరళ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రంగనాథస్వామికి పూజలు



అలంకరణలో రంగనాథస్వామి

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలో సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం, బ్రాహ్మణ సంతర్పణ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక పూలతో స్వామి వారిని అలంరించగా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం



కాలిపోతున్న పూరిళ్లు

అమడగూరు: కందుకూరిపల్లిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వివరాలు..గ్రామానికి చెందిన జెరిపిటి గంగులప్ప, రమణ ఇళ్లకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే రెండిళ్లు దగ్ధమయ్యాయి. జెరిపిటి గంగులప్ప ఇంట్లో గొర్రెలు అమ్మగా వచ్చిన డబ్బు రూ50 వేలు, 2 వాకిళ్లు, కిటికీలతో పాటుగా దుస్తులు, జెరిపిటి రమణ ఇంట్లో రూ.5 వేలు, బియ్యం 20 కేజీలు, వాకిలీ, కిటికీలు, పాత్రసామాన్లు కాలిపోయినట్లు పేర్కొన్నారు. వీఆర్‌ఓ గ్రామానికి వెళ్లి నష్టాన్ని పరిశీలించారు. ఎంపీటీసీ కోగర జయమ్మ, నాగరాజు దంపతులు తక్షణ సాయంగా బాధితులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు, 20 కేజీల బియ్యాన్ని అందజేశారు.



నిరుపేదలకు వరం

10 వేల మందికి పురుడు..

ముఖ్యంగా నిండు గర్భిణులు సుఖప్రసవం అయ్యేలా చేస్తున్న ఘనత 108కే దక్కుతుంది. పెనుకొండ నియోజకవర్గంలో అంబులెన్స్‌లో పురుడు పోసుకున్న శిశువులు 10 వేల మందికి పైగా ఉన్నారంటే 108 వాహన సేవలు ఎలా అందుతున్నాయో అంచనా వేయొచ్చు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలకు గురైన దాదాపు 25 వేల మందికిపై ఆస్పత్రికి తరలించి 108 వాహనాలు వారిని ప్రాణాపాయస్థితి నుంచి బయట పడేశాయి.



108 వాహనంలో ప్రసవించిన దృశ్యం (ఫైల్)

- ఆపదలో ప్రాణాలను నిలబెడుతున్న 108
- ఫోన్ చేస్తే చాలు 15 నిమిషాల్లో సంఘటనా స్థలానికి
- ఐదేళ్లలో 108 వాహనాల్లో 10 వేల మందికి ప్రసవం

రొద్దం: అత్యవసర సమయంలో బాధితుల ప్రాణాలకు అండగా నిలుస్తోంది 108 అంబులెన్స్. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 108 అంబులెన్స్‌కు ఊపిరి పోసింది. కోట్లాది రుపాయల నిధులు వెచ్చించి మండలానికో 108 వాహనం, అందులో అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా వేలాది మంది క్షతగాత్రుల ప్రాణాలకు 108 వాహనాలు భరోసా ఇస్తున్నాయి. కీలకమైన సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తుండటంతో ఎంతో మంది ప్రాణాలు నిలబెడుతున్నాయి.

వాహనంలో అత్యాధునిక సదుపాయాలు

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, గుండెపోటు వంటి ఎన్నో సంఘటనల్లో దిక్కుతోచని సమయాల్లో బాధితులకు గుర్తు వచ్చేది 108 వాహనమే. ఫోన్ చేసిన 15 నిముషాల్లో సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను అక్కున చేర్చుకుని వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలిస్తోంది. గర్భిణుల కోసం వాహనాల్లో ప్రత్యేకంగా నియోనేటర్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రథమ చికిత్స కోసం ఆక్సిజన్, బీపీ, పల్స్ చూసేందుకు అవసరమైన ఆధునిక పరికరాలు, ప్రసవం చేసేందుకు ఎమర్జెన్సీ డిస్పోజల్ డెలవరీ కిట్లు వాహనంలో ఉంచారు. అత్యవసర సమయాల్లో చికిత్స కోసం హెడ్ ఆఫీస్‌కు ఫోన్ చేసి సలహాలు తీసుకుని ఈఎంటీలు (ఎమర్జెన్సీ మెడకల్ టెక్నీషయన్) వైద్యం అందిస్తున్నారు.

నిమిషాల్లో సంఘటనా స్థలానికి...

108 సేవలకు ఎక్కడ నుంచి ఫోన్ చేసినా 15 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడుతున్నారు. గతంలో రోగులకు మెరుగైన చికిత్స కోసం తరలించేందుకు 108 వాహనానికి 30 కిలోమీటర్లు మాత్రమే అనుమతి ఉండేది. అయితే ప్రస్తుతం రోగిని కాపాడేందుకు జిల్లాలో ఏ ఆస్పత్రికైనా తరలించేందుకు వెసులుబాటు ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. కోవిడ్ సమయంలోనూ మండల పరిసర ప్రాంతాల్లో రోగులను క్వారంటైన్‌లకు తరలించడంలో 108 అంబులెన్స్‌లు కీలకపాత్ర పోషించాయి.

అపర సంజీవిని 108



ఏదైన ప్రమాదం జరిగి ఆపదలో ఉన్నవానికి 108 అపర సంజీవినిలా ఆదుకుని ప్రాణాలు కాపాడుతోంది. గర్భిణులకు ప్రసవ సమయల్లో 108 ఎంతగానో ఉపయోగపడుతోంది. జగనన్న ప్రభుత్వం వచ్చాక 108 సేవలు మెరుగ్గా పనిచేస్తున్నాయి. మండల కేంద్రానికి 108 వాహనం కేటాయిండటంతో ప్రమాదాలు, ప్రసవ నొప్పులు వచ్చినప్పుడు ఫోన్ చేస్తే 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి వస్తున్నారు.

– గంగమ్మ పెద్దమంతూరు

ఫోన్ చేసిన వెంటనే సేవలు



గత ప్రభుత్వ హయాంలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 108 వాహనానికి ఫోన్ చేస్తే వాహనంలో డీజల్ అయిపోయిందని డ్రైవర్లు చెప్పేవారు. అయితే జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నూతనంగా ప్రతి మండలానికి 108 వాహనం ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తప్పాయి. ఫోన్ చేసిన వెంటనే 108 వాహన సేవలు అందుతున్నాయి.

– రవిశేఖర్‌రెడ్డి రొద్దం

నా ప్రాణాలు కాపాడారు



2021లో నాకు రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రగాయాలతో ప్రాణాపాయస్థితిలో పడివున్నాను. స్థానికులు వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనంలో నన్ను ఆస్పత్రికి తరలించారు. వారు సకాలంలో వైద్య సేవలు అందించడంతో ఈరోజు ప్రాణాలతో ఉన్నాను.

– లక్ష్మన్న, రొద్దం

ఐదు నామినేషన్ల తిరస్కరణ



నామినేషన్ల పరిశీలనలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ సార్వత్రిక ఎన్నిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు వేసిన నామినేషన్లను శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పరిశీలించారు. పరిశీలన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి ఉషశ్రీచరణ్‌తో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. నామినేషన్ ముగిసే సమయానికి 25 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో వివిధ కారణాలతో ఐదు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఆఖరుగా 20 నామినేషన్లు, 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

తప్పిన ప్రమాదం



ప్రయాణికుల సీట్ల వరకు వచ్చేసిన ఆర్టీసీ బస్సు

పెనుకొండ: ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళితే.... కొత్తచెరువు నుంచి హిందూపురంకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వచ్చింది. అయితే బస్సు తిప్పుకునే క్రమంలో అదుపు తప్పి ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లింది. ప్రయాణికులు పక్కకు పరుగులు తీయడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

29న మండల మీట్

సోమందేపల్లి: మండ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కురుబవాండ్లపల్లి గ్రామస్తులు



రొద్దం: టీడీపీ కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీ

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ వర్గీయులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రొద్దం: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలకు అండగా ఉంటామని మంత్రి ఉషశ్రీ చరణ్ భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ అనేది ఒక అబద్ధపు పార్టీ అన్నారు. టీడీపీని నమ్ముకుంటే నట్టేట మునగడం కాయమని విమర్శించారు.

విత్తనాలు సకాలంలో అందించండి



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు సునంద

గోరంట్ల: ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలను వ్యవసాయశాఖ సబ్సిడీతో అందించి ఆదుకోవాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండాపురం ఎంపీటీసీ సభ్యురాలు సునంద మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవసరమైన మొక్కజొన్న, రాగి తదితర అంతర పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సహాయ వ్యవసాయ అధికారి స్పందిస్తూ విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకుంటే విత్తనాలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ, విద్యుత్, రక్షిత మంచి నీటి తదితర శాఖల అధికారులు, ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పురోగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ అక్బల్‌బాషా , అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న కోసం సంసిద్ధులు కండి



సమావేశానికి హాజరైన జేసీఎస్, బూత్ లెవల్ కన్వీనర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో వజ్ర భాస్కర్‌రెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: వచ్చే నెలలో జరిగే ఎన్నికలు ఎంతో కీలకమైనవని జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సంసిద్ధం కావాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు వజ్ర భాస్కర్ రెడ్డి, జిల్లా సచివాలయాల కన్వీనర్ మారుతిరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్‌తో కలిసి నియోజకవర్గ, మండల, బూత్ లెవల్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతు ఎన్నికల్లో ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలను ఛేదించి ఓటుతో బుద్ధి చెప్పేలా ప్రచారం నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి గడపకూ వెళ్లి గడచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసి సీఎం జగన్‌కు బహుమతిగా ఇద్దామని పేర్కొన్నారు. సీఎం జగన్ పథకాలే మనకు శ్రీరామ రక్ష అని,ఆయన పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేర్చారన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి పేదకు పథకాలందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్న మరోసారి సీఎం కావాల్సిన అవసరం ఉందని, ఇందుకు మనమంతా శక్తివంచన లేకుండా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం పెనుకొండ పట్టణంలోని మంత్రి కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అనుబంధ కమిటీల అధ్యక్షులు సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, బూత్ మెంబర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తరలిరావాలన్నారు.

193 చెరువులు నింపి రుణం తీర్చుకుంటా

- ఎర్రబల్లి రోడ్‌షోలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఎర్రబల్లి రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పునాది వేసిన హంద్రీ-నీవా కాలువ ద్వారా పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరు నింపి పుట్టిన గడ్డ పుట్టపర్తి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బండ్లపల్లి పంచాయతీలోని ఎర్రబల్లిలో స్థానిక నాయకులతో కలిసి భారీరోడ్‌షో నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధి తిరిగారు. అవ్వతాతలకు ఒకటవ తేదీన ఫించన్ రావాలన్నా, చదువుకునే పిల్లలకు అమ్మఒడి డబ్బు రావాలన్నా, ఆటో కార్మికులను, రజకులకు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు రూ.10 వేలు రావాలన్నా, చేనేత కార్మికులకు నేతన్న నేస్తం రూ.24 వేలు రావలన్నా, పేద విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం విద్యనభ్యసించాలన్నా జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ బండ్లపల్లి పంచాయతీలో ఐదేళ్లలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు.అలాగే నియోజకవర్గంలో 193 చెరువులకు నీరు నింపే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. అన్ని చెరువులకు నీరు నింపుటకు పుట్టపర్తి మండలం చెర్లోపల్లి వేలాదిగా భారీ ఐరన్‌పైపులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

బీసీల ద్రోహి చంద్రబాబును నమ్మి మోసపోవద్దు: ప్రతిపక్ష నేత చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి తమది బీసీల పార్టీ అని చెప్పుకుంటు ఎమ్మెల్యే సీట్లు ఇస్తానని నమ్మించి మోసం చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అనేక నామినేటెడ్ పదవులతో పాటు అనంతపురం, హిందూపురం ఎంపీస్థానాలను కేటాయించారన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని, ఆయన వస్తే వర్షాలు రావని ఎద్దేవా చేశారు.

చదువుల తల్లిని మోసగించిన ఘనుడు పల్లె

టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను తన కళాశాల ఖాతాలకు మళ్లించుకుని చదువుల తల్లి సరస్వతి దేవిని మోసం చేసిన పల్లె రఘునాథరెడ్డి అని ఎమ్మెల్యే విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో జరిగిన నామినేషన్‌కు శ్రీధర్‌కి మద్దతుగా వచ్చిన జనం చూసి ఈసారి ఓటమి తప్పదని గ్రహించిన పల్లె తన అనుచరలు ద్వారా ప్రశాంతమైన గ్రామాల్లో చిచ్చు పెట్టి ఘర్షణలకు ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎన్నికల్లో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశాడు. ఫ్యాను స్పీడుకు పవన్‌కళ్యాణ్ సైకిల్‌కు పంక్చర్లు వేసుకోవాలని సూచించారు. చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం అమిత్‌షా కాళ్ళు పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి చెన్నరాశిపల్లి, ఎర్రబల్లిలో ఇంటింటా తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిని, ఎంపీగా బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, మండల పరిశీలకులు ఆవుటాల రమణారెడ్డి, పెడబల్లి ఏపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్, సర్పంచ్ గీతా రుప్లానాయక్, బండ్లపల్లి సింగిల్ విండ్ అధ్యక్షుడు తిప్పారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మహబుబ్ బాషా,మాజీ సర్పంచ్‌లు నంజిరెడ్డి, బ్యాళ్ల రామచంద్ర, డాబా రాణాప్రతాప్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్వర్, శంకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అనితమ్మ, రాజేంద్ర, డీలర్లు రామచంద్రరెడ్డి, అనిల్, రాము, వెంకటేష్, ఎంపీటీసీ వేమూరి సూరి, మున్వర్‌బాషా, దుదేకుల దస్తగిరి, ఆటోబైపిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టి టీడీపీ కండువా వేశారు!



సొంత గూటికి చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి తమను మభ్యపెట్టి టీడీపీ కండువా వేశారని నల్లసింగయ్యగారిపల్లికి చెందిన పలువురు ధ్వజమెత్తారు. గ్రామానికి చెందిన నాగరాజు, సలాంవలీ, బైకు ఆదినారాయణ, వెంకట్రమణప్ప, నారాయణ, ప్రతాప్‌రెడ్డి టీడీపీలో చేరినట్లు ఆపార్టీ నాయకులు శుక్రవారం ఉదయం ప్రకటించుకున్నారు. అయితే కొన్ని గంటల్లోనే వారు పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో సొంత గూటికి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదో పని ఉందంటూ కొందరు తమను పిలుచుకొని వెళ్లగా మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి మభ్యపెట్టి టీడీపీ కండువా వేశారన్నారు. తాము ఎప్పటికీ వైఎస్సార్ సీపీ కార్యకర్తలమేనని, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విజయం కోసం తాము పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, నారపరెడ్డి, కొక్కంటి శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి,

ఓటు స్వేచ్ఛగా వినిగించుకోండి

గోరంట్ల: ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినిగించుకోవాలని సీఐ సుబ్బరాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గౌనివారిపల్లి, శీనప్పల్లి, కొండాపురం, బూదిలివాండ్లపల్లి, చలమయ్యగారిపల్లి గ్రామాల్లో సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదన్నారు.